# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 25 । జూలై । 2023






### అర్హులకు ధ్రువీకరణ పత్రాలు
జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వేలాది మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందించినట్టు ఎమ్మెల్యే ధనలక్ష్మి తెలిపారు. 8లో



### పులి ఆనవాళ్లు లభ్యంకాలేదు
చౌలూరు ప్రాంతంలో పులి సంచరించినట్టు ఆనవాళ్లు లభ్యం కాలేదని అటవీ రేంజర్ మోహినీ విజయలక్ష్మి తెలిపారు. 8లో



### రోడ్డుపై కూలిన చెట్టు 8లో
ఘాట్ రోడ్డులో పాములేరు గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడింది. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

## న్యూస్‌రీల్

### శాశ్వత భూ హక్కు, భూ రక్షతో గిరిజనులకు లబ్ధి
• పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పట్టాలు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

**చింతపల్లి రూరల్:** జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంతో గిరిజనులకు లబ్ధి చేకూరుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రం చింతపల్లిలో సోమవారం జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ కంఠం భూమిలో నివాసముంటున్న గిరిజనులకు ఈ పథకం ద్వారా భూమిపై శాశ్వత హక్కు కల్పిస్తున్నట్టు చెప్పారు. మండలంలో బాలాజీపేటకు చెందిన 11మంది గిరిజనులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి,జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత,ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లచ్చపాత్రుడు,డీటీ రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి,ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్,వైస్ ఎంపీపీ వెంగళరావు,ఎంపీటీసీ జయలక్ష్మి,కో–ఆప్షన్ సభ్యుడు నజర్‌వలీ,స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, కురుస తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### రోగులకు మెరుగైన సేవలు



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

**జి.మాడుగుల:** విధుల పట్ల అలసత్వం వహించకుండా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా అన్నారు. జి.మాడుగులలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ,మందులు, రికార్డులు పరిశీలించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సెంట్రల్ కమిటీ సందర్శించనుండడంతో ముందుగా డీఎంహెచ్‌వో పీహెచ్‌సీని పరిశీలించినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

### బురదలో కూరుకు పోయిన ఆర్టీసీ బస్సు



తంటికొండ వద్ద బురదలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

**రాజవొమ్మంగి :** మండలంలోని తంటికొండ గ్రామం వద్ద రహదారిపై ఏలేశ్వరం డిపోకు చెందిన నర్సీపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు సోమవారం బురదలో కూరుకుపోయి నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించే క్రమంలో ఇలా జరిగిందని డ్రైవర్ తెలిపారు. ఈ బస్సుతో పాటు పలు ద్విచక్ర వాహనాలు, ప్రైవేట్ వాహనాలు చాలాసేపు ఆగిపోయాయి. మండలంలో ఎన్‌హెచ్ 516ఈ జాతీయ రహదారి పనులు జరుగుతుండడంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఈ రహదారి చిత్తడిగా మారింది.

### బోధన తీరు మారాలి
• ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థినిని ప్రశ్నిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

**అనంతగిరి:** స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల–2 పాఠశాలను సోమవారం ఐటీడీఏ పీవో అభిషేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, లెక్కలు సబ్జెక్ట్‌లకు సంబంధించిన పలు ప్రశ్నాలు వేశారు. విద్యార్థినులు సమాధానం చెప్పలేకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బోధన తీరు మారాలంటూ హెచ్చరించారు. తనిఖీ సమయంలో సోషల్, లెక్కల ఉపాధ్యాయులు లేకపోవడంపై ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీచేయాలని, డీడీని ఆదేశించారు.



చింతూరు మండలం కుయిగూరు వద్ద వరదనీటిలో చిక్కుకున్న బస్సు

విలీన మండలాల్లో గోదావరి, శబరి వరద తగ్గుముఖం పట్టింది. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు,వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు, జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.

# తగ్గుతున్న వరద
# వదలని వాన

• ఇంకా శాంతించని వాగులు
• వరద నీటిలో చిక్కుకున్న బస్సు

**చింతూరు:** విలీన మండలాల్లో గోదావరి, శబరి నదుల వరద క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల నుంచి వచ్చే వరద నీరు తగ్గడంతో గోదావరి కూడా శాంతించింది. కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో ఆదివారం రాత్రి వరకు పెరుగుతూ వచ్చిన గోదావరి నీరు సోమవారం ఉదయం నుంచి నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. చింతూరు మండలంలో ఎగపోటుకు గురైన శబరినది కూడా నెమ్మదిగా తగ్గుతోంది. కాగా నదులు తగ్గుతున్నా వాగుల నీరు ఇంకా రహదారులపైనే నిలిచి ఉండడంతో వరుసగా ఐదోరోజు కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చింతూరు మండలంలో సోకిలేరు, చీకటివాగుల వరద నీరు రహదారి పైనుంచి ప్రవహిస్తుండడంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల నడుమ, మండలంలోని 15 గ్రామాలకు సోమవారం కూడా రాకపోకలు నిలిచిపోయాయి.

**పొంగిన కుయిగూరు వాగు**

ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి మండలంలోని కుయిగూరు వాగు పొంగి ప్రవహించింది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదనీటితో కుయిగూరు వాగు జాతీయ రహదారి–326 పైనుంచి ప్రవహించింది. దీంతో మధ్యాహ్నం వరకు ఆంధ్రా, ఒడిశా నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం వరదనీరు తగ్గడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. కుయిగూరు, కల్లేరు నడుమ జాతీయ రహదారి కొంతమేర కొట్టుకుపోయింది.



దెబ్బతిన్న ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారి

**వరదనీటిలో చిక్కుకున్న బస్సు**

ఉదయం వాగును దాటేందుకు ప్రయత్నించిన ఒడిశాకు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వరదనీటిలో చిక్కుకుంది.

ఆ సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా బస్సుదిగి నీటిలో నడుచుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. అనంతరం వరద సహాయక సిబ్బంది జేసీబీ సాయంతో బస్సును బయటకు తీశారు.



పాడేరు పట్టణంలో ముసురు వాతావరణం



బిరుగూడ వాగు దాటుతున్న గిరిజనులు

### కుండపోత
• జిల్లాలో విస్తారంగా వర్షాలు
• చింతూరులో 178.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

**సాక్షి,పాడేరు:** జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. డివిజన్ కేంద్రమైన చింతూరులో ఆదివారం నుంచి కుండపోతగా భారీవర్షం కురవడంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. 178.6 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది.పాడేరు,రంపచోడవరం డివిజన్ల పరిధిలో కొన్ని చోట్ల భారీవర్షం కురవగా, పాడేరు, హుకుంపేట, అరకులోయ, డుంబ్రిగుడ, పెదబయలుల్లో ముసురు వాతావరణం నెల కొంది.పాడేరు డివిజన్‌లోని మత్స్యగెడ్డతో పాటు అన్ని గెడ్డలు,వాగుల్లో నీటిఉధృతిఅధికంగానే ఉంది.

**ముంచంగిపుట్టు:**వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కించాయిపుట్టు పంచాయతీ గడ్డిబంద గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో సైతం ముంతగుమ్మి, బిర్రిగూడ వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంత గిరిజనులు అతికష్టం మీద వాగు లను దాటి వెళ్తూ సాగిస్తున్నారు.

**వర్షపాతం వివరాలు**

చింతూరులో 178.6 మిల్లీమీటర్లు, దేవీపట్నంలో 54.6, గంగవరంలో 53.4, మారేడుమిల్లిలో 50.2, రంపచోడవరంలో 30.2,ఏటపాకలో 23.4,అడ్డతీగలలో 22.8,వి.ఆర్.పురంలో 20.4, కూనవరంలో 15.6,వై.రామవరంలో7.4, అనంతగిరిలో7.6, ముంచంగిపుట్టులో5.8, పెదబయలులో 4.6,రాజవొమ్మంగిలో 4.2,జి.మాడుగులలో 3.2,జి.కే.వీధిలో 2.6, కొయ్యూరులో 2.2, పాడేరులో 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం సోమవారం నమోదైంది.

## 4,050 ధ్రువీకరణ పత్రాల పంపిణీ
• కలెక్టర్ సుమిత్ కుమార్

**సాక్షి,పాడేరు:** జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో 10 గ్రామ సచివాలయాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలు విజయవంతమైనట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.10,264 గృహాలను సందర్శించిన వలంటీర్లు వివిధ ధ్రువీకరణపత్రాల నిమిత్తం 7,818 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారని ఆయన తెలిపారు. 4,050 సర్టిఫికెట్లను ఆయా లబ్ధిదారులకు పంపిణీ చేశామని చెప్పారు.41 దరఖాస్తులు తిరస్కరించామని, మిగిలిన ధ్రువీకరణపత్రాలను రెండు మూడు రోజుల్లో ఆయా సచివాలయాల సిబ్బంది,వలంటీర్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

## కటక్–హైదరాబాద్ స్పెషల్ సెప్టెంబర్ 27 వరకు పొడిగింపు

**తాటిచెట్లపాలెం(విశాఖ):** ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్– కటక్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు మరికొంత కాలం నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. హైదరాబాద్–కటక్(07165) స్పెషల్ హైదరాబాద్‌లో ప్రతీ మంగళవారం రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుండి 9.07 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు సెప్టెంబర్ 26వ తేదీ వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో కటక్–హైదరాబాద్ (07166) స్పెషల్ కటక్‌లో ప్రతీ బుధవారం రాత్రి 10.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది. ఈ స్పెషల్ సెప్టెంబరు 27వ తేదీ వరకు పొడిగించారు.

# గార్డెన్ నిర్వహణ భేష్
• పద్మాపురం ఉద్యానవనాన్ని సందర్శించిన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే



గార్డెన్ పరిశీస్తున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్



లోగేలి వంతెనను పరిశీలిస్తున్న కాంతిలాల్ దండే, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

**అరకులోయటౌన్:** గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉదయం పద్మాపురం ఉద్యానవనాన్ని సందర్శించారు. ఉద్యానవనంలో నూతనంగా నిర్మించిన ట్రీ హట్స్, పగోడాలు, గార్డెన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్న ట్రీహట్స్‌కు ఆనుకొని ఉన్న పాత భవనాన్ని పరిశీలించి కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రెస్టారెంట్‌కు సమీపంలోనే జీసీసీ ఉత్పత్తుల స్టాల్లు ఏర్పాటు చేయాలని పీవో అభిషేక్‌కు సూచించారు. గార్డెన్ నిర్వహణ బాగుందని గార్డెన్ మేనేజర్ లకే బొంజుబాబును అభినందించారు. పర్యటనలో పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఇంజినీరింగ్ చీఫ్ శ్రీనివాసరావు, ఈఈ వేణుగోపాలరావు, డీఈ సుబ్బారావు, ఏఈలు అభిషేక్, అప్పలనాయుడు, ఏటీడబ్ల్యూ మల్లికార్జున్‌రావు, ఐటీడీఏ ప్రోగ్రాం ఆఫీసర్ గణపతి నాయుడు, స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మూర్తి పాల్గొన్నారు.

**సమస్యలపై వినతులు**

అరకులోయ పర్యటనకు వచ్చిన కాంతిలాల్ దండెకు సోమవారం పలువురు ఉద్యోగులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఏకలవ్య టీచింగ్, గురుకులం నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. తమను రెగ్యూలర్ చేయాలని, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో త్వరలో రిక్రూట్ చేయబోయే టీపీటీ, హెచ్‌పీటీ పోస్టుల్లో తమకు అవకాశం కల్పించాలని, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ ఏకలవ్య పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు కోరారు. సంబంధిత కార్యదర్శితో చర్చించి న్యాయం చేస్తానని కాంతిలాల్ దండే వారికి తెలిపారు.

**త్వరితగతిన వంతెన నిర్మాణం**

**డుంబ్రిగుడ :** మండలంలోని గసభ పంచాయతీ లోగేలిలో రూ.180 లక్షలతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులను వేగంతం చేసి, ఆగస్టులో ప్రారంభించాలని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే అన్నారు. నిర్మాణంలో ఉన్న ఆ వంతెనను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంటనే పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ,ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

## పీజీటీ,జేఎల్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**సాక్షి,పాడేరు:** జిల్లాలో పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు,కళాశాలల్లో ఖాళీగా ఉన్న పీజీటీ,జూనియర్ లెక్చరర్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఈ విద్యాసంవత్సరానికి మాత్రమే భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్లకు సంబంధించి ఇంగ్లిషు– 2, గణితం–2, జువాలజీ– 1, హిస్టరీ– 1, కామర్స్(ఒకేషనల్)– 1,జీఎఫ్‌సీ(ఎకనామిక్స్)–1, పీజీటీలో గణితం–1 పోస్టుల భర్తీకి గాను అర్హులైన ఇంగ్లిషు మీడియం చదివిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం 5గంటల లోపు పాడేరు ఐటీడీఏలోని గురుకులం సెల్‌లో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 29, 30 తేదీల్లో పరిశీలించి, ఈనెల 31వతేదీ, ఆగస్టు 1న పాడేరు గురుకుల కళాశాలలో ఎంపిక నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులంతా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు. విద్యార్హత, ఇతర వివరాల కోసం 9491030243, 9492929375 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పీవో సూచించారు.

## హైస్కూల్ ప్లస్‌లో సబ్జెక్టు టీచర్ల భర్తీ

**విశాఖ విద్య:** జిల్లాలోని హైస్కూల్ ప్లస్‌లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఈవో ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ పరిధిలోని మల్కాపురంలో గణితం, ఫిజిక్స్, జువాలజీ అదేవిధంగా జెడ్పీ మేనేజ్‌మెంట్ పరిధిలోని కూండ్రంలో కెమిస్ట్రీ, గోపాలపట్నంలో గణితం, కెమిస్ట్రీ, పాయకరావుపేటలో కెమిస్ట్రీ, సివిక్స్, రాంపురంలో గణితం సబ్జెక్టుల బోధనకు టీచర్లు అవసరం ఉందన్నారు. ఆయా మేనేజ్‌మెంట్ స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ (సంబంధిత సబ్జెక్టు)లు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ నెల 26న విద్యార్హత, సర్వీసు పరమైన ధ్రువీకరణ పత్రాలతో నేరుగా విశాఖలోని డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అర్హత గల వారికి వెంటనే నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# హుషారుగా స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్
• 108 మంది హాజరు
• వచ్చేనెల 4న ఫైనల్ ఎంపిక

**అరకులోయటౌన్:** స్థానిక స్పోర్ట్స్ స్కూల్ (జోన్–1 స్థాయి)లో సీట్ల భర్తీకి సోమవారం జరిగిన సెలక్షన్స్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక ఏపీ గురుకుల క్రీడ పాఠశాలలో జరిగిన ఈ సెలక్షన్స్‌కు మొత్తం 108 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. 5వ తరగతిలో 30 సీట్లకు గాను 68 మంది హాజరుకాగా, 6వ తరగతిలో 6 సీట్లకు గాను 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. జోన్–1తోపాటు రాష్ట్ర స్థాయిలోని అన్ని జోన్లకు సంబంధించి వచ్చేనెల 4న అరకులోయలో ఫైనల్ ఎంపిక జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. పీడీలు రామారావు, వినోదిని, పీఈటీలు రాంబాబు,ప్రేమ్‌కుమార్, సింహాచలం నాయుడు, కోచ్‌లు రాజుబాబు, ఎల్. సూరిబాబు పాల్గొన్నారు.



ఎంపికలో పాల్గొన్న విద్యార్థి

# కాసులు కురిపిస్తున్న చేపలు



మత్స్యగెడ్డలో చేపలు వేటాడుతున్న గిరిజన మత్స్యకారులు

• మత్స్యగెడ్డలో జోరుగా వేట

**సాక్షి,పాడేరు:** మత్స్యగెడ్డలో లభిస్తున్న మత్స్య సంపద గిరిజనులకు కాసులుకురిపిస్తోంది. జిల్లాలో జి.మాడుగుల,పాడేరు,హుకుంపేట,పెదబయలు,ముంచంగిపుట్టు మండలాల్లో విస్తరించిన మత్స్యగెడ్డలో చేప ల వేట జోరందుకుంది. వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలో నీటి ఉధృతి అధికంగా ఉంది. చేపల వేటకు అనుకూలంగా ఉండడంతో ఏజెన్సీలోని గిరిజన మత్స్యకారులతో పాటు ఒడిశాలోని పాడువా ప్రాంత గిరిజనులు నాటుపడవల్లో వెళ్లి చేపలు వేటాడుతున్నారు.పెద్ద సైజు చేపలు వలల్లో పడుతుండడంతో మంచి లాభాలు వస్తున్నాయి.మత్స్యగెడ్డలో లభించే చేపలకు పెదబయలు,ముంచంగిపుట్టు, జోలాపుట్టు,హుకుంపేట,పాడేరు,అరకులోయతో పాటు ఒడిశాలోని ఒనకఢిల్లీ,లమతాపుట్టు,పాడువా,చటువా, నందపూర్ ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది.రుచికరంగా ఉండే బంగారుపాప, బొచ్చు వంటి చేపలు 10కిలోలకు పైగా బరువు ఉన్నవి లభ్యమవుతున్నాయి. ఇవి హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి.కిలో రూ.300ధర పలుకుతుండడంతో మత్స్యకారులకు మంచి ఆదాయం లభిస్తోంది.



10 కిలోల బొచ్చు చేప

# పక్కాగా ఓటర్ల సర్వే
• కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్.పక్కన జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

**సాక్షి,పాడేరు:** జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా తిరిగి ఓటర్ల సర్వేను పారదర్శకంగా, పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయం నుంచి రంపచోడవరం,పాడేరు డివిజన్ల పరిధిలోని రెవెన్యూ అధికారులతో ఓటర్ల సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం 6,ఫారం 7,ఫారం 8ల సేకరణ సక్రమంగా జరగాలన్నారు.కుల,కుటుంబ ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు. భూముల రీసర్వేలో నిర్దేశించిన లక్ష్యాలను ఆగస్టు నెలాఖరునాటికి పూర్తి చేయాలని, 383 గ్రామాల్లో తుది భూ హక్కు పత్రాలను రూపొందించాలని ఆదేశించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో భూ సర్వేను జాప్యం చేస్తున్నారని, వేగం పెంచాలన్నారు. పాడేరులో సర్వేను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. విలేజ్ సర్వేయర్లు,వీఆర్వోలు సర్వేడేటాను వేగంగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్,రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ తదితరులు పాల్గొన్నారు.

**డుంబ్రిగుడ:** గిరిజన ప్రాంతంలోని బూత్ లెవెల్ అధికారులు నెల రోజు పాటు ఓటర్ల జాబితా సవరణ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఎంత మంది ఓటర్లు ఉన్నారో సర్వే చేసి యాప్‌లో పొందుపరచాలన్నారు. డబుల్ ఎంట్రీలు ఉంటే సంబంధిత అధికారులకు ఆ జాబితాను అందజేయాలన్నారు. సర్వేలో గ్రామ వలంటీర్లను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించవద్దని తెలిపారు.అటవీ ప్రాంతంలో ఉన్న గిరిజనుల ఇళ్లకు నంబర్లు లేక పోతే వారి వివరాలను తహసీల్దార్లకు అందజేయాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే సబ్‌కలెక్టర్,తసీల్దార్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ,తహసీల్దార్ నాగమ్మ,బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



జీఎం కొత్తూరు గ్రామంలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

**ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం తనిఖీ**

**జి.మాడుగుల:** ఓటరు సర్వేను పక్కాగా నిర్వహించాలని జేసీ శివ శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలో జి.మాడుగుల పంచాయతీ జీఎం కొత్తూరులో నిర్వహిస్తున్న ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెట్ సదుపాయం లేక యాప్ పనిచేయని సందర్భాల్లో ఇంటింట సర్వే చేసినప్పుడే ఓటర్ల వివరాలు ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేసి, కార్యాలయానికి వచ్చిన తరువాత ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీపీఆర్వో గోవిందరాజులు,తహసీల్దార్ అప్పలస్వామి, వీఆర్వో కుమారి, బీఎల్‌వోలు జీవన్, తరుణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమా వేశంలో మాట్లాడుతున్న రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్

**పారదర్శకంగా సర్వే**

**వై.రామవరం:** ఇంటింట సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవిల్ అధికారులతో సోమవారం సబ్‌కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 31 పోలింగు బూత్‌ల పరిధిలో ఉన్న 31 మంది బీఎల్‌వోలు తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, డీటీ కె.సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నక్కపల్లి/ఎస్.రాయవరం: విద్యార్థులు రాసిన వర్క్‌బుక్‌లను సక్రమంగా పరిశీలించని ఇద్దరు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తనిఖీల్లో.. విద్యార్థులు తప్పులు రాసినా టీచర్లు సరైన సమాధానమని టిక్ పెట్టిన విషయం గమనించారు. ఇందుకు బాధ్యులైన నక్కపల్లి మండలం అమలాపురం పాఠశాల ఉపాధ్యాయుడు టి.అప్పలనాయుడు, ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం హెచ్‌ఎం మళ్ల రమణలపై చర్య తీసుకోమని డీఈవోను ఆదేశించారు. అందుకు అనుగుణంగా వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ డీఈవో వెంకటలక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవోలు కుంచం నరేష్, అప్పారావు తెలిపారు.

# జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి



సాలభం గ్రామంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్



నెల్లిపూడిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

జి.మాడుగుల: రాష్ట్రంలో ప్రజా సమస్యలు పరిష్కరించి సంక్షేమ పథకాలు అందించటానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టినట్టు ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి, డీపీఆర్వో గోవిందరాజులు తెలిపారు. మండలంలో సాలభం-2(గొందిపాడు)సచివాలయం, బొయితిలి సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ధ్రువపత్రాలను అందించి సంక్షేమ పథకాలు అమలు చేయటానికి ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఉచితంగా 11సేవలతో ధ్రువపత్రాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా సాలభం-2 సచివాలయం పరిధిలో 537 మందికి, బొయితిలి సచివాలయం పరిధిలో 1119 మందికి వివిధ రకాల ధ్రువ పత్రాలను వారు అందజేశారు. మొబైల్ ఆధార్ కేంద్రం, వైద్యశిబిరాలను వారు పరిశీలించారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, తహసీల్దార్ కె.అప్పలస్వామి, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, ఎంఈవో బాబూరావుపడాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, డీటీ మోహన్‌రావు, సర్పంచ్‌లు ఐసరం హనుమంతరావు, లసంగి మాలన్న, ముత్యాలమ్మ, కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, ఎంపీటీసీలు అప్పలరాజు, చిన్నారావు, గబ్బాడి సన్యాసిదొర, జెఎస్‌ఎస్ మండల ఇన్‌చార్జి కళ్యాణం, మండల పార్టీ అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండం నాయుడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు: ఎమ్మెల్యే ధనలక్ష్మి**

గంగవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వేలాది మందికి వివిధ రకాల పత్రాలు అందించడం జరిగిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. సోమవారం నెల్లిపూడి సచివాలయంలో ఆవరణలో సర్పంచ్ పాతర రమణమ్మ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 200 మంది లబ్ధిదారులకు వివిధ రకాల పత్రాలను ఆమె పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను అందజేస్తోందన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ లబ్ధిని అందించడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మక అమలు చేస్తున్నారన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 11 మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా సాగుతుందన్నారు. గంగవరం మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సుమారు 5000 మందికి వివిధ రకాల పత్రాలను అందించామన్నారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీ రత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, కో -ఆప్షన్ సభ్యుడు ప్రభాకర్ రావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యజ్జు వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఏసు, మండల సచివాలయాల ఇన్‌చార్జి మాగంటి శ్రీను, మండల కన్వీనర్ అప్పలరాజు, మండల ఇన్‌చార్జి రఘునాథ్, పార్టీ అరకు పార్లమెంటు జిల్లా కార్యదర్శులు బాబి, ఏడుకొండలు, సర్పంచులు రామలక్ష్మి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతు భరోసా కేంద్రాన్ని, ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: రైతులు ముఖాల్లో చిరునవ్వులు చూడాలన్నదే జగనన్న ధ్యేయమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు మహానేత రాజశేఖరరెడ్డి రైతులకు నిరంతరం విద్యుత్‌ను ఇచ్చి వారిని కష్టాల నుంచి గట్టెక్కించారన్నారు. నేడు అతని తనయుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుకు రెట్టింపు సాయం రైతులకు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు లభిస్తాయన్నారు.రైతు భరోసా కింద ప్రభుత్వం ఏటా రైతులకు రూ.13,500 అందిస్తుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రైతులకు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఒక్క హామీ కూడా అమలుచేయలేదన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేకపోవడంతో అమలుకాని హామీలు ఇస్తున్నారన్నారు. ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కిముడు శివరత్నం, సర్పంచ్ కొర్రా సుభద్ర, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, వైస్ సర్పంచ్ రాంబాబు,పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్,నాయకులు కంకిపాటి గిరిప్రసాద్, అంజీ, రామకృష్ణ,అరుణ్ పాల్గొన్నారు.

# హార్బర్ పనులు చకచక!

- తొలిదశలో ప్యాకేజింగ్, కోల్డ్ ఛాంబర్, పార్కింగ్, రోడ్ల పనులు
- ఆధునికీకరణకు రూ.151.81 కోట్లు
- మారనున్న చేపల రేవు రూపురేఖలు



ఫిషింగ్ హార్బర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం పనులు

సాక్షి, విశాఖపట్నం: ప్రతిష్టాత్మక విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత డిసెంబరులో ఈ పనులు మొదలయ్యాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచ శ్రేణి ఓడరేవుగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద కేంద్ర ప్రభుత్వం రూ.151.81 కోట్లు మంజూరు చేసింది. మొత్తం ఏడు దశల్లో ఈ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. తొలిదశలో ప్యాకేజింగ్ యూనిట్, కోల్డ్ చాంబర్, పార్కింగ్ ఏరియా, రోడ్లు వగైరాలకు రూ.40.60 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందులో ఇప్పటివరకు 21 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. రెండో దశలో ఎలక్ట్రికల్ పనులు పురోగతిలో ఉన్నాయి. మూడో దశలో రెండు వేలం హాళ్లు, రిటైనింగ్ వాల్‌ల నిర్మాణం తదితర పనులకు రూ.30.88 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో ఒక్కో బ్లాక్‌కు రూ.2.5 నుంచి 3 కోట్ల వరకు వెచ్చిస్తారు. నాలుగో దశలో రోజుకు 800 కిలోలీటర్ల సామర్థ్యంతో బుక్కా కాలువ వద్ద ఎఫ్ల్యూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.4.81 కోట్లు వ్యయం చేయనున్నారు. దీనికి గత నెల 21న టెక్నికల్ బిడ్‌ను తెరిచారు. ఐదో దశలో ఫ్లోటింగ్/ఫిక్స్‌డ్ జెట్టీల నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది. ఆరో దశలో డ్రెడ్జింగ్ నిర్వహణ పనులు పురోగతిలో ఉన్నాయి. ఏడో దశలో టైర్ ఫెండర్ల ఏర్పాటు చేయనున్నారు. దీనికి బిడ్ దాఖలైంది. ఇది పరిశీలనలో ఉంది. మరోవైపు మత్స్యకారులు వలలు కుట్టుకునేందుకు నెట్ మెండింగ్ హాలు, వాటర్ ట్యాంకు పనులు, పరిపాలనా బ్లాకు, అసోసియేషన్ల ఆఫీసు బేరర్ల భవనాల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయని, సత్వరమే తొలిదశల పనులు పూర్తవుతాయని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు.

**మారనున్న రూపురేఖలు..**

ఆధునికీకరణతో విశాఖ ఫిషింగ్ హార్బర్ రూపురేఖలు సమూలంగా మారిపోనున్నాయి. రూ.151.81 కోట్లతో హార్బర్‌లోని ప్లాట్‌ఫాంలకు మరమ్మతులు చేపడతారు. రెండు పెద్ద ఎయిర్ కండిషన్డ్ ఆక్షన్ హాలు, మత్స్యకారులకు విశ్రాంతి గదులు, క్యాంటీన్, చేపల రిటైల్ అమ్మకం షాపులు, కోల్డ్ స్టోరేజీలు, అత్యవసర ఫైర్ సబ్‌స్టేషన్ వంటివి ఏర్పాటవుతాయి. విడిగా ప్యాకింగ్ షెడ్, ఆటోమేషన్, లోడింగ్, అన్‌లోడింగ్ బే, డార్మిటరీలు, ఫుడ్‌కోర్టు, ఆర్వో ప్లాంట్, పెద్ద చేపల ఎగుమతికి వీలుగా కన్వేయర్ బెల్టు వంటివి కూడా అందుబాటులోకి వస్తాయి. చేపలను ఎండబెట్టడానికి 20 మెకానికల్, 10 సోలార్ డ్రయ్యర్లతో పాటు కీలకమైన డ్రైనేజీ వ్యవస్థను కూడా మెరుగు పరుస్తారు. ఇంకా అత్యవసరంగా బోట్ల మరమ్మతుల కోసం డాక్ ఫెసిలిటీని కూడా సమకూరుస్తారు.



# తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న తపాలశాఖ అధికారులు, సిబ్బంది

చింతపల్లిరూరల్: తపాలశాఖ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఐపీవో శ్రీనివాసరావు అన్నారు. మండలంలో అన్నవరంలో సోమవారం ఆయన వన్‌జన్‌ధన కార్యక్రమాం నిర్వహించారు. తపాలశాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు తపాలశాఖ బీమాలు, పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్‌జన్‌ధన కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గిరిజనులకు ఆర్థిక స్వావలంభన కల్పించడమేనని చెప్పారు. తపాల శాఖ బీమాలతో ప్రజలకు అధిక లాభాలు చేకురుతాయన్నారు. పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఖాతాదారుడు ఇంటి వద్దనే కేంద్ర ,రాష్ట్ర పథకాలు సొమ్మును పొందవచ్చాన్నారు. అన్నవరం సర్పంచ్ సన్యాసిరావు, పైలా శ్రీను తదితర తపాలశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన ఉత్సవాల్లో గంగవరం విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ హేన్సన్

గంగవరం: విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర గిరిజన ఉత్సవాల్లో గంగవరం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని చోడి హేమ రాజ సాయి ఈశ్వరీ దేవి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపినట్టు పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ హేన్సన్ తెలిపారు.రాష్ట్ర స్థాయి పెయింటింగ్ పోటీల్లో కన్సొలేషన్ బహుమతి పొందినట్టు ఆమె తెలిపారు. ఈ బహుమతిని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చేతులమీదుగా విద్యార్థిని అందుకుంది. ఆమెను ఉపాధ్యాయులు, వసతి గృహం డిప్యూటీ వార్డెన్ లక్ష్మీకాంత, పీఈటీ పద్మావతి, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ కలుముల అక్కమ్మ అభినందించారు.

# పులి ఆనవాళ్లు లభ్యంకాలేదు

చింతూరు: మండలంలోని చౌలూరు అటవీప్రాంతంలో పులి సంచరించినట్టు ఎటువంటి ఆనవాళ్లు లభ్యం కాలేదని చింతూరు అటవీ రేంజర్ మోహినీ విజయలక్ష్మి తెలిపారు. చౌలూరు అటవీప్రాంతంలో ఓ ఆవుపై పులిదాడి చేసిందని గ్రామ రైతులు తెలపడంతో సోమవారం అటవీశాఖ సిబ్బంది ఆవు మృతిచెందిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ ఆవు మృతిచెందిన ప్రాంతంలో పులిజాడకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఆవు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని, నివేదిక అనంతరం పూర్తి వివరాలు తెలిసే అవకాశముందని ఆమె తెలిపారు. నేషనల్ పార్క్ అయిన ఈ ప్రాంతంలో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటిలో ఎక్కడా పులిజాడ కనిపించలేదని ఆమె తెలిపారు. తాజాగా ఘటన జరిగిన స్థలంలో కూడా సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పశువులపై దాడి సంఘటనలు జరిగితే గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొస్తే తగిన జాగ్రత్తలు తీసుకుంటామని రేంజర్ తెలిపారు.

## సెరిబ్రల్ మలేరియాతో 14 ఏళ్ల బాలుడు మృతి



సందీప్ పాల్ (ఫైల్)

అనంతగిరి : మండలంలో గల కొత్తూరు పంచాయతీ కేంద్రానికి చెందిన పల్లి సత్తిబాబు, సంతోషిల కుమారుడు పల్లి సందీప్ పాల్ (14) కొన్ని రోజులుగా సెరిబ్రల్ మలేరియాతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో వైద్య సేవల నిమిత్తం సందీప్‌ను విశాఖ తరలిస్తుండగా మార్గం మధ్యలో ఫిట్స్ రావడంతో పరిస్థితి విషమంగా మరింది. వెంటనే విశాఖ తరలించి, అరిలోవలోని రైస్ బో ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. బ్రెయిన్‌లో వాపు వచ్చినట్టు, సెరిబ్రల్ మలేరియాగా గుర్తించినట్టు వైద్యులు తెలిపారు. ఐసియూలో ఉంచి వైద్య సేవలు అందిస్తుండగా సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం సీతంపేటలో హోలీ స్పిరిట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు దూరం అవ్వడంతో తల్లిదండ్రులు సత్తిబాబు,సంతోషిలు,కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదించారు.

## బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

**బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు**

తాటిచెట్లపాలెం(విశాఖ): సౌత్ ఈస్టర్న్ రైల్వే, అద్రా డివిజన్ తల్‌గోరియా, బొకారో నార్త్ కేబిన్ పరిధిలో డబ్లింగ్ పనుల కారణంగా బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ వయా చంద్రపూర, బర్‌కాకానా, మురి స్టేషన్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

పలు రైళ్లకు మారిన వేళలు

- టాటానగర్-ఎర్నాకుళం(18189) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి పాలక్కడ్‌కు రాత్రి 10.35 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 10.40 గంటలకు బయలుదేరుతుంది.
- షాలిమార్-తిరువనంతపురం(22642) సూపర్ ఫాస్ట్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి పాలక్కడ్‌కు రాత్రి 11.35 గంటలకు చేరుకుని, అక్కడ నుండి 11.40 గంటలకు బయలుదేరుతుంది.
- సిల్చార్-తిరువనంతపురం సెంట్రల్(12508) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి పాలక్కడ్‌కు రాత్రి 11.35 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 11.40 గంటలకు బయలుదేరుతుంది.

## గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



రామారావు (ఫైల్)

రాజవొమ్మంగి : మండలంలోని చెరకుంపాలెం పంచాయతీ, మర్రిపాలెం గ్రామానికి చెందిన కుంజం రామారావు (55) అనే గిరిజనుడు భార్య మందలించిందని మనస్తాపానికి గురై ఈనెల 22వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది చూసిన భార్య, ఆశ వర్కర్, 108 సహాయంతో అతనిని ఏలేశ్వరంలోని సీహెచ్‌సీకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. పూర్తి వివరాల్లోకి వెళితే నిరుపేద రైతు రామారావు కౌలుకు తీసుకొన్న పొలంలో పత్తి సాగు చేస్తున్నాడు. ఇంతలో తల్లి మరణించడంతో తీవ్ర మనోవ్యధకు గురయ్యాడు. తల్లి అంత్యక్రియల తరువాత కూడా మందు తాగుతూ సమయం వృధా చేస్తుండగా పొలానికి ఎరువులు వేయవా, ఇలా తాగి కూర్చొంటే కష్టాలు తీరిపోతాయా అని భార్య అన్నపూర్ణ మందలించింది. పొలానికి పిండి నేనైనా వేస్తాను అని అన్నపూర్ణ పొలానికి వెళ్లగా అక్కడ గడ్డి మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకొన్న భర్త కనిపించాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జడ్డంగి ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

## 1న ఇనార్బిట్‌మాల్‌కు సీఎం శంకుస్థాపన



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ

సీతంపేట: స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందతున్న విశాఖ మహానగరంలో నగర ప్రజల జీవన విధానానికి తగినట్టు ఇనార్బిట్‌మాల్‌ను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఆగష్టు 1వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఆయన సోమవారం జోన్5 పరిధి 45వ వార్డు కై లాసపురం రోడ్ల ఏర్పాటు చేయనున్న ఇనార్బిట్‌మాల్ ప్రాంతాన్ని పరిశీలించారు. శంకుస్థాపనకు అవసరమైన ఏర్పాట్లు, కార్యక్రమంలో పాల్గొననున్న అతిథులు, ప్రముఖుల వాహనాల పార్కింగ్, స్టేజి, రెస్ట్ రూమ్ తదితర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు,పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రామారాయుడుపేట కొండపై హెలికాప్టర్ చక్కర్లు

మునగపాక: రామారాయుడుపేట కొండపై సోమవారం అరగంటకు పైగా హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. దీంతో ఏం జరుగుతుందోనని కొంతమంది ఆత్రంగా చూశారు. హెలికాప్టర్ నుంచి నలుగురు వ్యక్తులు రోప్ సాయంతో కొండపైకి దిగారు. ఈ సమయంలో హెలికాప్టర్ కొండపై చక్కర్లు కొడుతూనే ఉంది. కొండపై దిగిన వ్యక్తులు అరగంట తర్వాత రోప్ సాయంతో హెలికాప్టర్‌పైకి చేరుకుని, వెళ్లిపోయారు. అసలు ఈ ప్రాంతంలో హెలికాప్టర్ అంతసేపు ఎందుకు చక్కర్లు కొట్టింది? రోప్ సాయంతో కొండపైకి ఎందుకు దిగారనే సందేహాలు ముసురుకున్నాయి. ఇంతకు మునుపెన్నడూ లేని విధంగా కొండపై హెలికాప్టర్ చక్కర్లు కొట్టడంతో స్థానికుల ఆసక్తిగా తిలకించడంతోపాటు, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సముద్ర జలాల నుంచి హైడ్రో పవర్ ఉత్పత్తికి పరిశోధనలు

- 'సాక్షి'తో యూఎస్‌కు చెందిన హైడ్రో కార్బన్ కెమిస్ట్రీ నిపుణుడు ప్రొఫెసర్ సూర్యప్రకాశ్



ప్రొఫెసర్ సూర్యప్రకాశ్

సాక్షి, విశాఖపట్నం: సముద్ర జలాల నుంచి హైడ్రో పవర్ ఉత్పత్తికి సంబంధించిన ఎలక్ట్రాలసిస్‌పై పరిశోధనలు జరుగుతున్నాయని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాకు చెందిన హైడ్రోకార్బన్ కెమిస్ట్రీ నిపుణుడు ప్రొఫెసర్ జీకే సూర్యప్రకాష్ తెలిపారు. ఇప్పటికే ఈ తరహా ప్రయోగాలు అమెరికాలో కొనసాగుతున్నాయని చెప్పారు. మన దేశంలో తమిళనాడులోని కారైకుడిలో పరిశోధనలు సాగుతున్నాయని తెలిపారు. విశాఖలో నిర్వహిస్తున్న ఎనర్జీ ఎఫిషియెంట్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. సముద్రపు నీటిలో ఉన్న లవణ శాతాన్ని, క్లోరిన్‌ను వేరు చేసి, ఆ నీటితో హైడ్రో పవర్ ఉత్పత్తికి మార్గాన్ని సుగమం చేయడమే ఎలక్ట్రాలసిస్ లక్ష్యమని వివరించారు. సముద్రపు నీటిని విద్యుత్ ఉత్పత్తికి ఏ రకంగా వినియోగించుకోవాలనే దానిపై పరిశోధనలు విస్తృతంగా సాగుతున్నాయన్నారు. ప్రపంచంలో 73 శాతం సముద్ర జలాలే ఉన్నాయని, ఎలక్ట్రాలసిస్‌పై పరిశోధనలు ఫలిస్తే భవిష్యత్తులో హైడ్రో పవర్ అత్యంత చౌకగా ఉత్పత్తికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 2029 నాటికి 71 మిలియన్ టన్నుల హైడ్రోజన్ అందుబాటులో ఉంటుందని, దీనిని మరింత పెంచడానికి ఎలక్ట్రాలసిస్ దోహదపడుతుందని ప్రొఫెసర్ సూర్యప్రకాష్ తెలిపారు.

## యోగా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతమ్మధార : విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో యోగా పోటీలు ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ యు. రామారావు, డాక్టర్. ఎం .రవి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 30న జరిగే జిల్లా స్థాయి యోగా పోటీలు సీతమ్మధార, నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 30తేదీలోపు దరఖాస్తు చేసు కోవాలని కోరారు. విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 99088 38387, 94403 01277లలో సంప్రదించాలని కోరారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్ : వాల్తేర్ రైల్వే స్టేడియంలో అంతర హోటల్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ వంశీకృష్ణ సోమవారం ప్రారంభించారు. స్థానిక హోటల్స్ ఈ టోర్నీలో పాల్గొంటుండగా పది ఓవర్లు ఇన్నింగ్స్‌గా పోటీలు టెన్నిస్ బాల్‌తో నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు శ్రీనివాస్, కార్తీక్, సందీప్, ప్రశాంత్ పాల్గొన్నారు. ప్రారంభ పోటీలో పామ్‌బీచ్‌తో పార్క్ హోటల్ జట్టు తలపడింది.

## రోడ్డుపై కూలిన చెట్టు: నిలిచిన వాహనాలు

మారేడుమిల్లి: మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో పాములేరు గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడింది. దీతో ఇరువైపులా వాహనాలు ,ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. వర్షంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం చెట్టును తొలగించడంతో యథావిధిగా రాకపోకలు సాగాయి.

# హుషారుగా వరినాట్లు



పాడేరుకు సమీపంలోని చింతలవీధి ప్రాంతంలో వరినాట్లు వేస్తున్న గిరిజన మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు వ్యవసాయానికి ఎంతో మేలు చేశాయి. పంట భూముల్లో పుష్కలంగా సాగునీరు చేరడంతో పాడేరు డివిజన్ పరిధిలోని గిరిజన రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. మహిళలు హుషారుగా వరినాట్లు వేస్తున్నారు.పాడేరుకు సమీపంలోని చింతలవీధి ప్రాంతంలో గిరిజన మహిళల వరినాట్ల దృశ్యమిది.